నాడు అధ్వానం.. నేడు అధునాతనం

నాడు

కల్లూర్‌లో శిథిలావస్థకు చేరిన గ్రామ పంచాయతీ భవనం

కోటగిరి, అక్టోబర్ 22 : ఉమ్మడి కోటగిరి మండలంలోని కల్లూర్ గ్రామ పంచాయతీ భవనం రూపురేఖలు మారాయి. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో శిథిలావస్థకు చేరి, అధ్వానంగా మారిన గ్రామపంచాయతీ భవనం.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తకళను సంతరించుకున్నది. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కొత్త భవనం కోసం రూ.21 లక్షలు మంజూరు చేయించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి ప్రత్యేక గదులతోపాటు గ్రామసభ నిర్వహించేందుకు విశాలమైన హాలును నూతన హంగులతో నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనంలో గ్రామస్తులకు సేవలు సులువుగా అందుతున్నాయి.

నేడు

ఆధునిక హంగులతో నిర్మించిన కల్లూర్ గ్రామ పంచాయతీ భవనం

దసరా శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

నిజామాబాద్ స్పోర్ట్స్ / మోస్రా (చందూర్), అక్టోబర్ 22 : జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకొనినే విజయదశమి వేడుకను.. ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు. దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు చేకూర్చాలని, చేపట్టిన కార్యాలు అమ్మవారి దయతో సఫలీకృతం కావాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగను కుటుంబసభ్యులతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, దేవీ నవరాత్రి శోభాయాత్రలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 22 : జిల్లాకేంద్రంలోని నాగారం గిరిజన గురుకుల మహిళా కళాశాలలో పార్ట్ టైం గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సైదా జైనాబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు పార్ట్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీలో 55 శాతంతో ఉత్తీర్ణత సాధించి.. సెట్, నెట్, పీహెచ్‌డీ పూర్తిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

బోటింగ్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ధర్పల్లి పెద్ద చెరువులో బోటు ప్రయాణం

ధర్పల్లి, అక్టోబర్ 22 : మండలకేంద్రంలోని పెద్దచెరువులో బోటింగ్ పాయింట్ కొనసాగుతున్నదని, సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో పెద్ద చెరువులో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో బోటింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 చార్జి తీసుకుంటున్నామని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న బోటింగ్‌ను పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా విజయదశమి మహోత్సవం

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 22 : నగరంలోని గుర్బాబాది రోడ్‌లో ఉన్న అక్షరధామ్ పాఠశాలలో విజయదశమి మహోత్సవాన్ని ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇందూరు విభాగ్ సహ కార్యవాహ వరంగటి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. దేవీ ఆరాధనలో దైవభక్తి, దేశభక్తి ఉందన్నారు. పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని అన్నారు. చంద్రయాన్ ప్రయోగం విజయవంతం ద్వారా భారత్ విశ్వగురువుగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవీదాస్ చందక్, డాక్టర్ గురుచరణం సత్యం, దత్తు, సుమిత్, స్వయంసేవకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు డీసీపీ గిరిరాజ్

డిచ్‌పల్లి, అక్టోబర్ 22 : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు ఫ్లాగ్ డేను మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఉదయం 8 గంటలకు బైక్ ర్యాలీని అదనపు డీసీపీ పోలీస్ గిరిరాజ్ జెండా ఊపి ప్రారంభించారు.

డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ నుంచి 44వ నంబర్ జాతీయ రహదారి గుండా డిచ్‌పల్లి, నడిపల్లి, ధర్మారం, మాధవ్‌నగర్, బోర్గాం, శివాజీనగర్, గాంధీచౌక్, బస్టాండ్ మీదుగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో నిజామాబాద్, బోధన్ ఏసీపీలు ఎం.కిరణ్‌కుమార్, కేఎం.కిరణ్‌కుమార్, సీఐలు కృష్ణ, నరహరి, సతీశ్‌కుమార్, వెంకట నారాయణ, శ్రీనివాస్‌రాజు, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, సీటీసీ శివరాం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పల నాయుడు, డిచ్‌పల్లి, ఇందల్‌వాయి ఎస్సైలు మహేశ్, తిరుపతి, మనోజ్, ఐటీ కోర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుమ్రంభీం జయంతి

కుమ్రం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం నాయకులు

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 : మండలంలోని మల్లారంలో కుమ్రం భీం జయంతిని ఆదివాసీ నాయకుపోడ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్రం భీం విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుకర్‌రావు, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, రాంగోపాల్‌రెడ్డి, ఆదివాసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ కమిటీ ఎన్నిక

బీఆర్ఎస్ మండల నాయకులతో యూత్ కమిటీ సభ్యులు

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 : నగర శివారులోని సారంగాపూర్ గ్రామ బీఆర్ఎస్ యూత్ కమిటీని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, మైనార్టీ నాయకుడు ఎండీ అక్బర్ నవాజుద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మధుకర్‌రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. యూత్ కమిటీ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి ఆంజనేయులు, జాయింట్ కార్యదర్శి సాయిరాం, కోశాధికారి మేఘరాజ్, ప్రచార కార్యదర్శి దేవరాజ్‌ను నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అఫ్సర్, నర్సాగౌడ్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నగరంలోని లలితాదేవి ఆలయం వద్ద ..

ఘనంగా బతుకమ్మ సంబురాలు

ఆర్మూర్/ ఖలీల్‌వాడి, అక్టోబర్ 22 : జిల్లా కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శనివారం రాత్రి, ఆదివారం బతుకమ్మ సంబురాలను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రధాన కూడళ్ల వద్ద ఉంచి, లయబద్ధంగా ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఆర్మూర్ పట్టణం, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఆలూర్‌తోపాటు జిల్లా కేంద్రంలోని లలితాదేవి అమ్మవారి ఆలయం వద్ద, వినాయక్‌నగర్, సారంగపూర్‌లో మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సారంగపూర్‌లో..